క్లుప్తంగా

నిత్యావసరాలు పంపిణీ



గుంటూరు ఎడ్యుకేషన్: వర్సటైల్ సర్వీసెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాతగుంటూరు ప్రగతినగర్‌లో నివసిస్తున్న పేదలకు నిత్యావసరాలు సోమవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పాశం కృష్ణదేవరాయ యాదవ్ పేదలకు సేవ చేయాలనే ఉద్దేశంతో పనిచేస్తున్నట్లు చెప్పారు. ట్రస్ట్ సభ్యులు కోనంకి మురళీ కృష్ణ యాదవ్, పాశం సర్దార్ అభినంద్ యాదవ్ మాట్లాడారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఆనంగి శ్రీనివాస యాదవ్, ఆనంగి రాణి రుద్రమదేవి, వలంటీర్లు ఆనంగి కృష్ణతేజ యాదవ్, హర్ష, దుర్గాప్రవీణ్, సంతోష్, స్థానిక కార్పొరేటర్ యల్లావుల అశోక్ యాదవ్, అల్లం బాజి, శేఖర్, సైదా పాల్గొన్నారు.

గంజాయి కేసులో ముద్దాయికి జైలు

గుంటూరు లీగల్: గంజాయి కేసులో నిందితుడికి ఆరునెలల జైలు, రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ ఒకటో జిల్లా కోర్టు జడ్జి వి.ఎ.ఎల్.సత్యవతి సోమవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం.. తాడేపల్లి మండలం నులకపేటలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు 2017లో జరిపిన తనిఖీల్లో గంజాయి విక్రయిస్తున్న చాదల కృష్ణ, దావు క్రాంతికుమార్‌ను అరెస్ట్ చేశారు. వీరి నుంచి 2.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అప్పటి మంగళగిరి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.బాలయ్య కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో ఒకటో జిల్లా కోర్టు జడ్జి వి.ఎ.ఎల్.సత్యవతి శిక్ష ఖరారు చేశారు. మొదటి ముద్దాయి కృష్ణ మృతి చెందగా రెండో ముద్దాయి దావు క్రాంతికుమార్ ఆరునెలలు జైలు శిక్ష రూ.2 వేల జరిమానా విధించారు. కేసులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వజ్రాల రాజశేఖర్ రెడ్డి వాదనలు వినిపించారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉగాదిని పురస్కరించుకుని వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న వారికి ఏప్రిల్ 13న ఉగాది పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు హైదరాబాద్‌కు చెందిన ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టారు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కవులు, రచయితలు, విద్యావంతులు, ఉపాధ్యాయులు, మేధావులు, ఆధ్యాత్మిక, యోగా గురువులు, కార్మికులు, కర్షకులు, క్రీడాకారుల ప్రతిభ, సేవలకు గుర్తింపుగా ప్రదానం చేయనున్న ఉగాది పురస్కారాలకు అర్హులైన వారు ఈనెల 31లోపు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, డోర్ నంబరు 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం పోస్టు, తిరుమలగిరి, సికింద్రాబాద్ -15కు తమ సేవలను తెలియజేసే సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, పత్రికల క్లిప్పింగ్స్, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు దరఖాస్తుకు జతపర్చి పంపాలని సూచించారు. ఎంపికైన వారికి ఏప్రిల్ 13న హైదరాబాద్‌లో 20వ ఉగాది పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో పురస్కారాలు ప్రదానం చేస్తామని తెలిపారు. వివరాలకు 96523 47207 నంబర్‌లో సంప్రదించాలని చెప్పారు.

28న వైద్యులకు క్విజ్ పోటీలు

గుంటూరు మెడికల్: రేడియాలజీ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో గుంటూరు ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) హాలులో ఈనెల 28న అకడమిక్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ చిటితోటి కిషోర్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ది గమట్ ఆఫ్ బోవెల్ ఇమేజింగ్ ఎకేస్ బేస్ట్ అప్రోచ్ ఫ్రమ్ స్టమక్ టూ యానల్ కెనాల్' అనే అంశంపై అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఉమామహేశ్వరరెడ్డి ప్రసంగించనున్నట్లు చెప్పారు. యువ రేడియాలజిస్టులు, పీజీ వైద్య విద్యార్థులకు క్విజ్ పోటీలు ఉంటాయని వెల్లడించారు. క్విజ్ పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి గెలుపొందిన వారికి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.8 వేలు, మూడో బహుమతిగా రూ.5 వేలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

ట్రాఫిక్ మైక్‌ల ఏర్పాటు


పట్నంబజారు: ట్రాఫిక్ నియంత్రణకు నగరంలో మైకుల ఏర్పాటు చేస్తున్నారు. దానిలో భాగంగా ఈస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ సీఐ ఎ.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పట్నంబజారులోని పూలమార్కెట్ సెంటర్ కూడలిలో ఆరు మైక్‌లను రోడ్డుకు నలువైపులా ఏర్పాటు చేశారు. మైకుల ద్వారా సిబ్బంది ఎప్పటికప్పుడు వాహనదారులు, ప్రజలను అప్రమత్తం చేయనున్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ రవీంద్రబాబు పాల్గొన్నారు.

తాడేపల్లి వ్యక్తికి ఉత్తమ కార్టూనిస్ట్ అవార్డు

తాడేపల్లి రూరల్: తాడేపల్లికి చెందిన ఐ. నాగేశ్వరరావుకు ఉత్తమ కార్టూనిస్ట్ అవార్డు అందుకున్నారు. విశాఖపట్నంకు చెందిన ఉత్తరాంధ్ర కోస్తా కార్టూనిస్టుల ఫోరం, హాస్యానందం సౌజన్యంతో ఉగాది (2025) సంవత్సరానికి గాను ఐ.నాగేశ్వరరావు వేసిన కార్టూన్‌ను ఎంపిక చేశారు. ఆ అవార్డును నాగేశ్వరరావు విజయవాడ కేబీఎన్ కళాశాలలో విశాఖపట్నంకు చెందిన నార్త్ కోస్ట్ ఫోరం, హాస్యానందం సంపాదకులు రాము, రామశర్మ, టి.ఆర్.బాబు, ఎస్.లక్ష్మణరావుల సమక్షంలో అందుకున్నారు. ఐ.నాగేశ్వరరావుకు అవార్డు రావడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేసవిలో మూత్ర సమస్యలు

- అప్రమత్తంగా ఉండాల్సిందే..
- నీరు తాగకపోతే కిడ్నీల్లో రాళ్లు



గుంటూరు మెడికల్: వేసవి కాలం ప్రారంభమైందంటే మూత్ర సంబంధిత సమస్యలు కూడా మొదలవుతాయి. ఎండ తాపం పెరిగే కొద్దీ శరీరంలో నీటి శాతం తగ్గిపోవటం, తగ్గిపోయిన నీటి శాతాన్ని తిరిగి తీసుకొచ్చేందుకు సరిపడ నీరు తాగకపోవడం వలన సమస్యలు రోజురోజుకు అధికమవుతాయి. కిడ్నీలో రాళ్లు ఏర్పడుతాయి. సైజు పెరిగే కొద్దీ బాధ మనిషిని ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. రాళ్లు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

రాళ్లకు కారణాలు..

కుటుంబంలో ఎవరికైనా కిడ్నీలో రాళ్లు ఏర్పడి ఆపరేషన్ చేయించుకోవడం, లేదా వైద్యం తీసుకుంటూ ఉన్నట్లయితే మిగతా సభ్యులు కూడా ఏమాత్రం ఆలోచించకుండా మూత్ర పిండాలు పరీక్ష చేయించుకోవడం చాలా ఉత్తమం. వారసత్వంగా కిడ్నీలో రాళ్లు వచ్చే అవకాశాలు ఉన్నాయి. పుట్టుకతో కిడ్నీలో తేడాలు ఉండటం వలన కూడా రాళ్లు ఏర్పడతాయి. శరీరం తీరు కూడా ఓ కారణం.

వయసుతో సంబంధం లేదు

కిడ్నీలో రాళ్లు ఏర్పడడానికి వయసుతో సంబంధం లేదు. చిన్నా, పెద్ద తేడా లేకుండా అందరిలో కూడా రాళ్లు ఏర్పడతాయి. ముఖ్యంగా 22 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు వారిలో, 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు వారిలో హార్మోనుల్లో తేడాల వలన రాళ్లు ఏర్పడతాయి. మూడు మిల్లీమీటర్ల నుంచి కిడ్నీ సైజు వరకు ఏర్పడతాయి. రాళ్లు ఏర్పడిన వారికి నడుము పక్కన నొప్పి, నొప్పితో పాటు జ్వరం వస్తుంది. మూత్రంలో రక్తం కారడం, వాంతులు అవడం, నొప్పి వచ్చిన సమయంలో మనిషిని మెలేసినట్లుగా ఉంటుంది.

ఆధునిక వైద్య పద్ధతులు



కిడ్నీలో రాళ్లను తొలగించేందుకు ప్రస్తుతం ఎన్నో వైద్య పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. ఒక సెంటీమీటర్ కంటే తక్కువ సైజులో ఉండే రాళ్లకు ఆపరేషన్ అవసరం లేదు, నీరు ఎక్కువగా తాగడం వలన మూత్రం ద్వారా బయటకు వెళ్లిపోతాయి. ఒక సెంటీమీటర్ సైజులో ఉండే రాళ్లు తొలగించేందుకు 'ఎక్స్‌ట్రా కార్పోరియల్ షాక్ వేవ్ లితోట్రిప్సీ'(ఈఎస్‌డబ్ల్యూ) వైద్య విధానం అందుబాటులో ఉంది. ఈ విధానంలో కిడ్నీ ఒక శాతం దెబ్బతినే అవకాశం ఉంది. నూతనంగా లేజర్ ట్రీట్‌మెంట్ రిట్రోగ్రేడ్, ఇంట్రారీనల్ సర్జరీ(ఆర్ఐఆర్ఎస్) అందుబాటులోకి వచ్చింది. ఈ విధానంలో మూత్ర నాళం గుండా కిడ్నీ గదుల్లోకి లేజర్ ఫైబర్ పంపి రాయిపై కిరణాలు ప్రసరింపజేసి పగులగొట్టి అక్కడి నుంచి బక్కెట్ ద్వారా బయటకు తీస్తారు.

– డాక్టర్ పోలుమట్ల జ్ఞానప్రకాష్, యూరాలజిస్ట్

రోగులు జాగ్రత్తలు పాటించాలి



మూత్ర పిండాల్లో రాళ్లు ఏర్పడి ఆపరేషన్ చేయించుకున్నవారు జాగ్రత్తలు తీసుకోకపోతే మళ్లీ ఐదేళ్లల్లో రాళ్లు వచ్చే ప్రమాదం ఉంది. ఆపరేషన్ చేయించుకున్నవారు ఆహార నియమాలు పాటించాలి. కొబ్బరి నీళ్లు ఎక్కువగా తీసుకోవడం ద్వార పోటాషియం, మెగ్నిషియం లభించి మూత్ర పిండాల్లో తిరిగి రాళ్లు ఏర్పడకుండా నివారించవచ్చు. క్యారెట్లు, కాకరకాయ తీసుకోవడం వలన మినరల్స్ పుష్కలంగా లభించి రాళ్లు ఏర్పడకుండా ఉంటాయి. అనసపండు రసం, బార్లి, ఓట్లు, నిమ్మరసం తాగడం వలన సైట్రైట్‌లు పుష్కలంగా లభించి రాళ్లు ఏర్పడకుండా నివారిస్తుంది. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ప్రతిరోజూ మూడు లీటర్లు నీరు తాగాలి.

– డాక్టర్ జె.కొర్నెలియస్, యూరాలజిస్ట్, గుంటూరు

ఎస్‌పీఎం సెమినార్ హాల్ ఆధునికీకరణ



హాలును ప్రారంభిస్తున్న డాక్టర్ సీతారామ, డాక్టర్ ఉమాజ్యోతి, డాక్టర్ సుందరాచారి

గుంటూరు మెడికల్: గుంటూరు మెడికల్ కాలేజీ సామాజిక వైద్యవిభాగం(ఎస్‌పీఎం) సెమినార్ హాల్‌ను ఆధునికీకరించి సోమవారం ప్రారంభించారు. విభాగాధిపతి డాక్టర్ సీతారామ, ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరచారి ముఖ్య అతిథులుగా విచ్చేసి సెమినార్ హాలు ప్రారంభించారు. శ్రీ హాస్పిటల్ రిజెనరేటివ్ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ ఎ.విజయరాజేష్, కార్డియాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ బి.నారాయణ రెడ్డి రెండు ఏసీలను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయరాజేశ్ మాట్లాడుతూ, కాలేజీ అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం ఎంతో సంతోషంగా ఉందని, భవిష్యత్‌లో మరింత సహకారం అందిస్తామన్నారు. ప్రిన్సిపాల్ సహకారంతో పరిశోధన కార్యక్రమాల నిమిత్తం విభాగానికి పరిశోధన ఆరు కంప్యూటర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జీజీహెచ్ డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నీలి ఉమాజ్యోతి మాట్లాడుతూ ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి నాయకత్వంలో కాలేజీ దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. డాక్టర్ ఏ సీతారామ మాట్లాడుతూ విద్యాలయ అభివృద్ధికి తోడ్పడుతున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

మాదిగలను మోసం చేస్తున్న చంద్రబాబు



మాట్లాడుతున్న బ్రహ్మయ్యమాదిగ

నెహ్రూనగర్: ఎస్సీ వర్గీకరణ పేరుతో సీఎం చంద్రబాబు మరోసారి మాదిగలను మోసం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్యమాదిగ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం గుంటూరులోని అంబేడ్కర్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రాష్ట్రంలో చంద్రబాబునాయుడు వర్గీకరణ అమలు చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అయితే ప్రస్తుతం రాష్ట్ర యూనిట్‌గా వర్గీకరణ అమలు చేసి.. వచ్చే సంవత్సరం నుంచి జిల్లా యూనిట్‌గా అమలు చేస్తామని ప్రకటించడం అంటే మాదిగలను నట్టేట ముంచి మాలలకు మేలు చేయాలని చంద్రబాబు చూస్తున్నారని మండిపడ్డారు. వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో తీర్మానం చేసిన కూటమి ప్రభుత్వం..ఆ తరువాత మండలిలో చర్చకు తీసుకురాకుండా వైఎస్సార్ సీపీ వర్గీకరణపై మాట్లాడటం లేదని మంద కృష్ణ మాదిగ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ముందు మండలిలో చర్చకు తీసుకొచ్చి ఆ బిల్లులను ఆమోదించుకోవాలన్నారు.

టీబీ అంతం ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలి

డీఎంహెచ్ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి



సీనియర్ పల్మనాలజిస్ట్ బాబూరావును సన్మానిస్తున్న వైద్య అధికారులు

గుంటూరు మెడికల్: టీబీని సమాజం నుంచి అంతమొందించేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని 2025 కల్లా టీబీ నివారణే లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేయాలని డీఎంహెచ్ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. గుంటూరు జిల్లా క్షయ నివారణ కార్యాలయం సిబ్బంది, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సోమవారం నిర్వహించారు. గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం నుంచి వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, నర్సింగ్ కళాశాల విద్యార్థులు గుంటూరు జీజీహెచ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు క్షయ వ్యాధిపై (టీబీ) అవగాహన కల్పించేలా ఫ్లెక్సీల చేతపట్టుకుని నినాదాలు చేస్తూ జిల్లా కోర్టు మీదుగా గుంటూరు వైద్య కళాశాల, జీజీహెచ్ వరకు ర్యాలీ కొనసాగింది. జీజీహెచ్‌లో జరిగిన కార్యక్రమానికి జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. క్షయ వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి, క్షయ వ్యాధి చికిత్సలు, క్షయ వ్యాధి నిర్ధారణలో ఆధునిక పరీక్ష విధానాల గురించి జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.సుందరాచారీ, డీఎంహెచ్ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, ఇతర వైద్యులు వివరించారు. టీబీ రహిత సమాజం నిర్మాణం కోసం అందరూ ముందుకు సాగాలన్నారు. టీబీ ముక్త్ గ్రామపంచాయతీలుగా ఎంపిక కాబడిన నాలుగు గ్రామ పంచాయతీల ప్రెసిడెంట్లను ఈ సందర్భంగా ప్రశంస పత్రం ఇచ్చి సత్కరించారు. ప్రపంచ టీబీ డేని పురస్కరించుకొని నర్సింగ్ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన పోటీ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. జిల్లాలోని క్షయవ్యాధి నియంత్రణ కార్యాలయం పరిధిలో క్షయ నివారణ కోసం పనిచేస్తున్న వివిధ హోదాలలోని ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యులు డాక్టర్ బాబూరావు, విశ్రాంత రీజినల్ డైరెక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ రత్న శ్రీ రోహిణి, డాక్టర్ లక్ష్యానాయక్, డాక్టర్ త్రివేణి, డాక్టర్ మానస, గోరంట్ల ఐ.డి.హెచ్. సూపరింటెండెంట్ డాక్టర్ రఘు పాల్గొన్నారు.

అర్జీలు సకాలంలో పరిష్కారానికి కృషి

కమిషనర్ పులి శ్రీనివాసులు



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీల్లో మౌలిక వసతులకు సంబంధించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్‌లో పీజీఆర్ఎస్ సోమవారం నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 18 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడారు. ప్రజల నుంచి అందే అర్జీల్లో తక్షణం పరిష్కారం చేయగలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేర్వేరుగా లిస్టు తయారు చేయాలని సూచించారు. డయల్ యువర్ కమిషనర్‌కి అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలని కోరారు. పురోగతిపై కమిషనర్ చాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

పీజీఆర్ఎస్‌కు 43 వినతులు..

అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి కమిషనర్ శ్రీనివాసులు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ వంటి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు జీఎంసీ కార్యాలయానికి వస్తున్నారని, అవి స్థానికంగానే పరిష్కారం చేయాలన్నారు. ప్రజల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదుల నమోదుకు ప్రతి విభాగంలో ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేయాలని కోరారు. పీజీఆర్ఎస్‌కు 43 ఫిర్యాదులు అందగా వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 11, ఇంజినీరింగ్ విభాగానికి 6, రెవెన్యూ విభాగానికి 8, ప్రజారోగ్య విభాగానికి 6, పరిపాలన విభాగానికి 1, అకౌంట్స్ విభాగానికి 1 చొప్పున ఫిర్యాదు అందాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సీపీ రాంబాబు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి

నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్యం మెరుగు కోసం ప్రత్యేక దృష్టి సారించినట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం కమిషనర్ యాదవుల బజార్, ఆనందపేట, అలీ నగర్, సూర్య నగర్, కబాడీ గూడెం, ఎల్ఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ నగరంలో ప్రజారోగ్య విభాగం కీలకమని, విభాగ పటిష్టత కోసం ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. ఇప్పటికే కార్మికుల రేషనలైజేషన్, అవసరమైన సామగ్రి, వాహనాలు కేటాయించామన్నారు. అయినప్పటికీ కొందరు అధికారులు, కార్యదర్శులు నిర్లక్ష్యంగా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పర్యటనలో కార్పొరేటర్లు అబీద్ బాషా, మీరావలి, డీఈఈ నాగ భూషణం, ఎస్ఎస్ రాంబాబు, టీపీఎస్ లక్ష్మణ స్వామి, ఏఈ రవి కిరణ్, పి.వెంకటేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ పాల్గొన్నారు.

హౌస్ హోల్డ్ జాబితాలో..

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రభుత్వం నుంచి పౌర సేవలతో పాటుగా సంక్షేమ పథకాలు, ఇతర ప్రయోజనాలు పొందేందుకు వార్డు సచివాలయాల కుటుంబాల(హౌస్ హోల్డ్) జాబితా, ఆర్టీజీఎస్ డేటా బేస్‌లో తమ వివరాలు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పథకాల అమలు, వినతుల పరిష్కార సమయంలో కుటుంబ జాబితాలోని వివరాలు సరిపోల్చుకున్న తరువాతే తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

35 ఏళ్ల తర్వాత కలిసిన ఏపీ జైలు శాఖ అధికారులు



1990 బ్యాచ్ సభ్యుడికి సత్కారం

నగరంపాలెం: చెన్నై వెల్లూరులోని రీజినల్ ఇనిస్టిట్యూషన్ ఆఫ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్‌లో శిక్షణ పొందిన 1990 బ్యాచ్ ఏపీ జైలు శాఖ అధికారులు 35 ఏళ్ల తర్వాత కలిశారు. గుంటూరు నగరంలోని ఓ హోటల్‌లో సోమవారం సమావేశమై పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. 60-76 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారు కలవడం ఆనందంగా ఉందని విశ్రాంత డీఎస్పీ డాక్టర్ కేవీ నారాయణ అన్నారు. గత శిక్షణ, తర్వాత జైళ్లలో పరిపాలన అభివృద్ధిని నెమరవేసుకున్నారు. ఆ బ్యాచ్‌లో ఇద్దరు డెప్యూటీ జైలర్లు 1991 బ్యాచ్ సివిల్ ఎస్ఐలుగా ఎంపికయ్యారని గుర్తుచేసుకున్నారు. సమావేశంలో వైజాగ్ డీఎస్పీ సీహెచ్ పెంటరావు పాల్గొని పలువురిని సత్కరించారు.

వైఖానస ఆగమ పండితుడు దీవి లక్ష్మీనరసింహాచార్యులు

నేడు తిరుపతిలో 'ఆగమ ద్యుమణి' బిరుదు ప్రదానం

తెనాలి: పట్టణంలోని రామలింగేశ్వరపేటకు చెందిన ప్రముఖ వైఖానస ఆగమ పండితుడు, ఆధ్యాత్మిక ప్రవచనకర్త దీవి లక్ష్మీనరసింహాచార్యులకు తిరుపతి రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం 'ఆగమ ద్యుమణి' బిరుదు ప్రదానం చేసి సత్కరించనుంది. విద్యాపీఠంలో మంగళవారం జరగనున్న వార్షికోత్సంలో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహాచార్యులు పరిచయం.



స్వగ్రామం.. కొలకలూరు

లక్ష్మీనరసింహాచార్యులు స్వస్థలం తెనాలి రూరల్ మండల గ్రామం కొలకలూరు. ప్రాథమిక విద్య నుంచి ఎస్ఎస్ఎల్‌సీ వరకు స్వగ్రామంలో చదివారు. మెదక్ జిల్లా సిద్దిపేటలో పీయూసీ, బీఏ పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ చేశారు. మరోవైపు తన సోదరుడు హనుమంతాచార్యులు వద్ద వైఖానస ఆగమ విద్య అభ్యసించారు. మెదక్ జిల్లాలోనే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా వృత్తి జీవితం ప్రారంభించారు. కొంతకాలం తర్వాత తెనాలి తిరిగివచ్చి స్థానిక వీఎస్సార్ కాలేజిలో తెలుగు అధ్యాపకునిగా చేరారు. ఆయన పాండిత్య గరిమను గుర్తించిన అమెరికాలోని తెలుగువారు 1991లో ఆహ్వానించారు. అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలోని శాన్‌ఆంటోనియాలో నిర్మితమైన వేంకటేశ్వరస్వామి దేవస్థానం ట్రస్ట్ ఆయనను ప్రధాన అర్చకునిగా నియమించింది. 2005 వరకు అక్కడ తన సేవలను అందించారు. తిరుమల తిరుపతి దేవస్థానం, దేవదాయ ధర్మదాయ శాఖ నిర్వహించే ఆగమ పరీక్షల అధికారిగా కొనసాగారు.

విద్యార్థులను తీర్చిదిద్దారు

వైఖానస ఆగమంలో ప్రతిష్ఠాంతం వరకు దేశ విదేశాలలో వ్యవహరించారు. అమెరికాలోని టెక్సాస్, బరసానధామ్, చికాగో, లివర్‌మోర్, డల్లాస్, సెయింట్ లూయిస్ ఆలయాల్లో ప్రతిష్టలు కుంభాభిషేకాలు, కల్యాణోత్సవాలు... వంటి దైవిక కార్యక్రమాలను నిర్వహించారు. అమెరికా ఆకాశవాణిలో తెలుగు, ఇంగ్లీషు, హిందీ, సంస్కృతం, కన్నడ భాషల్లో ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక ప్రాంతాల్లో భాగవత సప్తాహాలు, సుందరకాండ పారాయణ, ఇతిహాసాల ప్రచారం నిర్వహణతో పాటు, వైఖానస ఆగమ శాస్త్రంలో పలువురు విద్యార్థులను తీర్చిదిద్దారు.

గౌరవాలు, సత్కారాలు

తన ఆధ్యాత్మిక సేవలకు గాను లక్ష్మీనరసింహాచార్యులు అనేక గౌరవాలను అందుకున్నారు.

- 1995లో అమెరికాలో అక్కడి ధార్మిక సంస్థలు 'ఆగమ బ్రహ్మ' బిరుదును ప్రదానం చేశాయి.
- రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ ఉగాది పురస్కారంతో సత్కరించింది. తెనాలి పట్టణంలోని వైఖానస సేవా సంఘానికి గౌరవ అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ తన వంతు సేవ చేస్తున్నారు.
- వైఖానస యూత్ ఫోరం, వైఖానస సంక్షేమ సంఘం, వైఖానస మహామండలి, హైదరాబాదులోని వేద్ కాన్ సంఘాలతో పాటు ఆర్యవైశ్య సంఘం, రంగనాథాచార్య స్మారక ట్రస్ట్, నారాయణ శ్రీనివాసాచార్య స్మారక ట్రస్ట్, సత్యసాయి సేవా సంఘం, గణేష్ ఉత్సవ కమిటీలు, ఆంజనేయ భక్త సమాజం, మెదక్ జిల్లాలోని జరా సంగం శివాలయం ట్రస్ట్, విద్యా కమిటీ, కొలకలూరు వంటి అనేక ధార్మిక, సేవా సంఘాలు ఆయనను సత్కరించాయి. + అధ్యాపక వృత్తి నుంచి రిటైరయ్యాక, ఆయన కుమారుడు దీవి రాంబాబు పేరిట స్మారక ట్రస్ట్ ఏర్పాటు చేసి ఆగమ పండితులు, ఆగమ, పేద విద్యార్థులు, పలు సంఘాలకు ఆర్థిక చేయూతను అందిస్తున్నారు. ఇప్పటికీ ఆగమ విద్యార్థులకు బోధిస్తున్నారు. తెనాలి, కొలకలూరు, జంపని గ్రామాలలో దైవిక కల్యాణ మండపాలు, ఆలయాలు, అపర కర్మశాల నిర్మాణాలకు ఆర్థికంగా సహకరించారు.

వీధి వ్యాపారుల నిరసన

నెహ్రూ నగర్: నగరంలో రోడ్లపై వ్యాపారం చేసుకునే వీధి వ్యాపారులను తొలగింపు ప్రక్రియ నిలిపివేయాలని కోరుతూ మున్సిపల్ కార్పొరేషన్ వద్ద నిరసన సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి మాట్లాడుతూ నగరంలో అనేక సంవత్సరాలుగా రోడ్లపై చిరు వ్యాపారం చేసుకునే పేదలను ఇబ్బందులకు గురిచేయడం తగదని పేర్కొన్నారు. రోడ్లకు, ట్రాఫిక్ అడ్డం లేకుండా వ్యాపారాలు కొనసాగినందుకు అవకాశం కల్పించాలని కోరారు.

ఏఎన్‌యూ లైబ్రేరియన్ విజయకుమార్ మృతి

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ లైబ్రేరియన్ డీబీ విజయకుమార్ మృతి తీరని లోటు అని పలువురు పేర్కొన్నారు. వర్సిటీలో సోమవారం సంతాప సభ నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి గుండెపోటుతో ఆయన మృతి చెందారు. యూనివర్సిటీలో పలు హోదాల్లో విధులు నిర్వహించిన విజయకుమార్ ప్రస్తుతం యూనివర్సిటీ ప్రధాన గ్రంథాలయం లైబ్రేరియన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సంతాప సభలో వీసీ కె.గంగాధరరావు, రెక్టార్ కె.రత్నషీలామణి, వికాస అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, జె.శ్రీనివాసరావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.వీరయ్య, బాబూ జగ్జీవన్‌రామ్, పూలే అధ్యయన కేంద్రాల డైరెక్టర్లు పీజే రత్నాకర్, ఎం.త్రిమూర్తిరావు, ఉద్యోగ సంఘ నాయకులు ఎస్.వెంకటేశ్వర్లు, వై.రాధాకృష్ణ పాల్గొని విజయకుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యూనివర్సిటీ అధికారులు, ఉద్యోగులు గుంటూరులోని విజయకుమార్ స్వగృహానికి వెళ్లి ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు.

బహుముఖ ప్రజ్ఞతో ఉన్నతస్థానాలకు చేరుకోవాలి



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఎస్వీ రమణ, డాక్టర్ లలిత

గుంటూరు ఎడ్యుకేషన్: బహుముఖ ప్రజ్ఞతో ప్రతిభావంతులుగా నిలిచిన విద్యార్థులు ఉద్యోగ, వ్యాపార రంగాల్లో ఉన్నతస్థాయికి చేరుకోవాలని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో చదువుతూ ఇటీవల వివిధ కళాశాలలు, విశ్వ విద్యాలయాలు నిర్వహించిన అంతర్ కళాశాలల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సోమవారం అభినందన సభ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్వీ రమణ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు వారిలోని నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు కళాశాల ఎల్లప్పుడూ తోడ్పాడు అందిస్తుందని తెలిపారు. ఈసందర్భంగా విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. విద్యార్థులను ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె. లలిత, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ అధికారి చల్లా వైష్ణవి, సహాయాచార్యులు సీహెచ్ వైష్ణవి, సీహెచ్ వేదవతి, అభిలాష్, బి. అనిత, రాజరాజేశ్వరి అభినందించారు.

పలు దుకాణాల్లో చోరీ

పట్నంబజారు: షాపు షట్టర్లు పగులగొట్టి చోరీకి పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాలు.. సంపత్‌నగర్‌లో నివాసం ఉండే పి.దుర్గాసతీష్ విద్యానగర్‌లోని వస్త్ర దుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. అతడి తల్లి రామలలిత, తండ్రి బ్రహ్మానందచారి సంపత్‌నగర్‌లో నాలుగేళ్లుగా టైలరింగ్‌షాపు నిర్వహిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లారు. తిరిగి సోమవారం ఉదయం వచ్చి చూసేసరికి షాపు షట్టరు పగులగొట్టి ఉండటం గమనించారు. లోపలకు వెళ్లి చూడగా, రూ.25 వేలు, పలు బంగారం, వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. వీరి షాపు ఎదురుగా ఉన్న మెడికల్ షాపు షట్టరు పగులగొట్టి రూ.5 వేలు, బంగారు, వెండి ఆభరణాలు దోచుకు పోయారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆప్రాంతంలోని పలు షాపుల్లో చోరీకి యత్నించినట్లు పోలీసులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన వెల్లడించారు.

27న బహిరంగ వేలం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ మార్కెట్లు, సైకిల్ స్టాండ్లు, టాయిలెట్స్‌ల టెండర్, బహిరంగ వేలం ఈ నెల 27న నగరపాలక సంస్థ ట్రావెలర్స్ బంగ్లాలో నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వేలంలో ఇప్పటికే ఉన్న లీజుదారులు కూడా బకాయిలు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి కలిగిన వారు రూ.100 చలానా చెల్లించి, నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో ఏ-2 గుమస్తా వద్ద నుంచి టెండర్ షెడ్యూల్ పొందవచ్చన్నారు. వివరాలకు డెప్యూటీ కమిషనర్ (9849908364)ని సంప్రదించాలని కోరారు.

13 మందికి కారుణ్య నియామక ఉత్తర్వులు



కలెక్టర్ నాగలక్ష్మితో కారుణ్య నియామక ఉత్తర్వులు పొందిన అభ్యర్థులు

గుంటూరు వెస్ట్: ప్రభుత్వ ఉద్యోగమంటే కేవలం ఉపాధి కోసం మాత్రమే కాదని ఇదొక సామాజిక బాధ్యత అని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో 13 మందికి కారుణ్య నియామకాల కింద గ్రామ, వార్డు సచివాలయాలతో పాటు వివిధ శాఖల్లో పోస్టింగ్ చేస్తూ నియామక ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, డిఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీ కుమారి, కలెక్టరేట్ ఏఓ పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

